శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలి



**బుచ్చి మార్చి 5 ప్రభాతవార్త** త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ సూచించారు.జిల్లా ఎస్పి తిరుమలేశ్వ ర్‌రెడ్డితో కలిసి ఆయన మండలంలోని పెనుబల్లి, సాల్మాన్‌పురం, దామరమడుగు గ్రామాలలో పోలింగ్ స్టేషన్ల పరిశీలించారు. పెనుబల్లి గ్రామంలో 65,66 పోలింగ్ కేంద్రాలలో పరిశీలించి ఇక్కడ ఏమైనా గొడవలు జరుగుతాయా అని ప్రశ్నించారు. గొడవలకు దిగితే తీవ్రమైన కేసులు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా ప్రజలందరు జిల్లా యంత్రాంగానికి సహకరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని అన్నారు.ఈకార్యక్రమంలో ఆయన వెంట ఎఎస్‌పి సౌజన్య, డిఎస్‌పి వీరాంజనేయరెడ్డి, తహసిల్దారు సురేష్‌బాబు, పోలీసులు,రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

## బీసీ వసతి గృహ విద్యార్థులు 100 శాతం ఫలితాలు సాధించాలి



**నెల్లూరు టౌన్, మార్చి5, ప్రభాతవార్త** వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహంలో చదివే విద్యార్థులు పదో తరగతిలోనూ, ఇంటర్మీడియట్‌లోనూ నూటికి నూరుశాతం ఫలితాలు సాధించే దిశగా సహాయ సంక్షేమ శాఖ అధికారులు వసతి గృహ సంక్షేమ అధికారుల కృషి చేయాలని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి వై.వెంకటయ్య సూచించారు. స్థానిక ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్ నందు మంగళవారం జిల్లాలోని సహాయ బీసీ సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వెంకటయ్య మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 54 ప్రభుత్వ బీసీ వసతి గృహం నుండి మొత్తం 631 మంది విద్యార్థినీ, విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని, అలాగే పోస్టు మెట్రిక్ వసతి గృహం నుండి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు మొత్తం 633 మంది పరీక్షలకు హాజరు కానున్నారని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో నూటికి నూరుశాతం ఫలితాలు ఎందుకు సాధించకూడదు అనే కృత నిశ్చయంతో సాదిద్దాం 100 శాతం ఫలితాలు అనే నినాదంతో విద్యార్థులను సన్నద్ధం చేసి మంచి ఫలితాలు సాధించే ఉద్దేశంతో సమీక్షా సమావేశం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. వసతి గృహ సంక్షేమాధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి వసతి గృహంలో ఉదయం ,సాయంత్రం క్రమం తప్పకుండా స్టడీ హవర్స్ నిర్వహించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తీర్ణులు అయ్యేలా చూడాలని, విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వం జారీ చేసిన మెనూ ప్రకారం భోజన సదుపాయం కల్పించాలని ఆదేశించారు. లక్ష్యాన్ని సాధించుటలో విఫలమైన వసతి సంక్షేమ అదికారులపై క్రమశిక్షణా చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ ఉప సంచాలకులు నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో సమీక్షా సమావేశానికి కూడా ఏబీసీడబ్ల్యూఓ, హెచ్‌డబ్ల్యూఓలు అందరూ పాల్గొన్నారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించుటకు తీసుకోవాల్సిన చర్యలు గురించి ఉప సంచాలకులు ఆదేశించారు. ఈసమావేశానికి వయోజన విద్య ఉప సంచాలకులు ఆజాద్, సహాయ బీసీ సంక్షేమ అధికాఉలు, ప్రసూన, తేజోవతి, శ్రీదేవి, సుధాకర్ వసతి గృహ సంక్షేమాధికారులు సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆవుల నరసింహం, జిల్లాలోని హెచ్‌డబ్ల్యూ ఓలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రతపై ప్రత్యేక దృష్టి పోర్టు సిఈఓ జిజె రావు



**ముత్తుకూరు, మార్చి5, ప్రభాతవార్త** భద్రతపై ఆదా కృష్ణపట్నం పోర్టు ప్రత్యేకమైన దృష్టి కలిగి ఉంటుందని ఆదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జిజెరావు పేర్కొన్నారు.53వ జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం కృష్ణపట్నం పోర్టులో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధులుగా విచ్చేసి ర్యాలీని ప్రారంభించారు.అనంతరం పోర్టు సీఈవో జిజె రావు మాట్లాడుతూ ఆదా కృష్ణపట్నం పోర్టులో భద్రతా ప్రమాణాలు పాటించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు ప్రత్యేక విభాగం కలిగి ఉందని ఆయన ఈ సందర్భంగా వివరించారు.పోర్టులో భద్రతతోపాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు.ప్రతి ఒక్కరూ వ్యక్తిగత భద్రత పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా పని సమయాల్లో భద్రతాచర్యలు పాటించడం వలన ప్రమాదాలను నివారించవచ్చునని ఆయన తెలిపారు.ప్రతిఒక్కరూ భద్రతా ప్రమాణాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.అనంతరం భద్రతపై వివిధ విభాగాల్లో ఉద్యోగులు కార్మికులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆదాని కృష్ణపట్నం పోర్టు సీఈఓ రాజన్ బాబు,సెక్యూరిటీ హెడ్ వెంకటేష్ భాస్కరన్,సేఫ్టీ హెడ్ రామకృష్ణ, రమేష్ బాబు,వివిధ విభాగాల హెచ్‌ఓలు,ఉద్యోగులు,కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్.ఓ వికాస్‌మర్మత్



**నెల్లూరు కార్పొరేషన్,మార్చి5,ప్రభాతవార్త** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2024వ సంవత్సరానికి సంబంధించిన నెల్లూరు సిటీ-117 నియోజకవర్గం ఓటర్ల జాబితాలోని అంశాలపై రాజకీయపార్టీల ప్రతినిధులతో రిటర్నింగ్ అధికారి,కమిషనర్‌వికాస్ మర్మత్ సమావేశాన్ని నిర్వహించారు.నెల్లూరునగరపాలక సంస్థ కార్యాలయ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం జరిగిన ఈ సమావేశంలో రాజకీయపార్టీల ప్రతినిధులు కొన్ని అంశాలను ప్రతిపాదించగా అందుకు ఆర్.ఓ సానుకూలంగా స్పందించారు.కనుపర్తిపాడు ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు,ఓటరు లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయనున్నామని స్పష్టం చేశారు.పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా పర్యవేక్షిస్తున్నామని,ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు సెక్టర్ ఆఫీసర్లు,సెక్టార్ పోలీస్ ఆఫీసర్లు తీసుకుంటున్నామని తెలిపారు. వైయస్‌ఆర్ సిపి రాజీవ్‌రెడ్డి,బిజెపి నరేష్,నవీన్‌కుమార్,టిడిపి హరికృష్ణ,రాజకీయ పార్టీల ప్రతినిధులు ఏఈఆర్‌ఓ వెంకటేశ్వరరావు,ఈడిటి స్వర్ణ చక్రపాణి పాల్గొన్నారు.

## అంతర్‌రాష్ట్రాల ఆర్చీరీ చాంఫియన్‌షిప్‌లో బంగారుపతకం సాధించిన లక్ష్మీ మోక్షిత



**నెల్లూరు,మార్చి5 ప్రభాతవార్త-విద్య** తమిళనాడుయూత్ ఫీల్డ్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రం చెన్నైలో నిర్వహించిన అంతర్‌రాష్ట్రాల ఇండోర్ ఫీల్డ్ ఆర్చరీ చాంఫియన్‌షిప్‌లో అండర్-12 విభాగంలో నగరంలోని స్థానిక రెయిన్‌బో ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని పిసి.లక్ష్మీ మోక్షిత బంగారు పతకం సాధించి సత్తా చాటింది. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పాఠశాలలో బంగారు పతకం సాధించిన విద్యార్థినితోపాటూ పతకాలు, జ్ఞాపికలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల చైర్మన్ సుబ్రమణ్యం మాట్లాడుతు తమ విద్యార్థులు చదువుతోపాటూ క్రీడల్లో కూడా రాణించటం సంతోషంగా ఉందన్నారు. అలాగే జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించటం జిల్లాకే గర్వకారణయన్నారు. మోక్షిత రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన కోరారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతీదేవి అలంకారంలో వేంకటేశ్వరస్వామి



**బుచ్చి మార్చి 5 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డి పాళెంలోని శ్రీరామకృష్ణా నగర్‌లో వెలసి యున్న శ్రీ కళాణ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారు హంసవాహనంపై సరస్వతీ అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను కమీటి వారు పర్యవేక్షించారు.

# వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రాలతో నిరుద్యోగులకు ఉజ్వల భవిష్యత్



**నెల్లూరు,మార్చి5 ప్రభాతవార్త-విద్య** రాష్ట్ర ముఖ్య మంత్రి వైస్.జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేస్తున్న వృత్తినైపుణ్య శిక్షణా కేంద్రాల ఏర్పాటుతో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని స్థానిక వెంకటేశ్వరపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రూ.70లక్షల రూపాయాలతో ఏర్పాటుచేసి స్కిల్ డెవలెప్‌మెంట్ భవనాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వర్చువర్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు 10 స్కిల్‌డెవలెప్‌మెంట్ కేంద్రాలను ముఖ్యమంత్రి ప్రారంభించటం జరిగిందన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత, విద్యార్థినీ విద్యార్థులకు వివిధ వృత్తి కోర్సుల్లో వృత్తి నెపుణ్య శిక్షణ ఇవ్వటంతో వారికి సమాజంలో మంచి గుర్తింపు తీసుకురావటమే లక్ష్యంగా ఈ కేంద్రాలు పని చేయనున్నాయన్నారు. ఎంపీ సురేష్ ప్రభు నిధుల నుండి 70 లక్షల ఖర్చుతో ఈ కేంద్రాని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. జిల్లాలోని యువతకు, స్థానికంగా ఉండే పరి శ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకుని శిక్షణ ఇచ్చి ఉపాది కల్పించటం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన ఈ కేంద్రాలను యువత సద్వినియోగం చేసుకోవానలి , తద్వారా ఉపాది పొందాలని ఆయన కోరారు. జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి వినీల్‌కుమార్, ఈఈ శ్యాంసన్, ప్రిన్సపాల్ ఎస్ రాజగోపాల్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, విద్యార్దులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యరంగానికి తగు ప్రాధాన్యత



**నెల్లూరు మార్చి 5, ప్రభాతవార్త-వైద్యం** జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక వైద్య రంగానికి తగు ప్రాధాన్యతను కల్పించి, ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నాడని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపాడు. మంగళవారం నగరంలోని దర్గామిట్టలో ఉన్న సర్వజన ప్రభుత్వ పెద్దాసుపత్రిలో చిన్నపిల్లలకు పౌష్టికాహారం, ఆరోగ్యం అందించేందుకు రూ. 35లక్షలతో రెన్నోవేషన్ చేసిన న్యూట్రిషన్ రిహాబిలిటేషణ్ సెంటర్‌ని ఎంపి ఆదాల రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం విద్య, వైద్యరంగానికి అధిక ప్రాధాన్యతను ఇచ్చి పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నాడు. అందులో భాగంగానే పౌష్టికాహారం లోపంతో బాధపడుతున్న, తగిన బరువులేని చిన్నారుల కోసం ఈ ఎన్‌ఆర్‌సి కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నాడు. ఇక్కడ చేర్చే బిడ్డలకు పౌష్టికాహారంతోపాటు సహాయకునికి రోజుకు రూ.100 అందించడం జరుగుతుందన్నాడు. ఏసీ, వేడినీరు పిల్లల ఆట పరికరాలు తదితర సదుపాయాలు ఇక్కడ ఉన్నాయని ఆయన చెప్పాడు. పేద పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని విని యోగించుకుని తమ బిడ్డలను మంచి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్నాడు. సూపరింటెండెంట్ అభివృద్ధిపై దృష్టి సారించాలి ఆ దాల పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్‌ని ఉద్దేశించి మాటాడుతూ ఎప్పుడూ సొంతూరైన తిరుపతి మీద ధ్యాసను కొంతవరకైనా తగ్గించుకుని ఈ ఆసుపత్రిపై దృష్టిసారించాలన్నాడు. ఇక్కడ పేదలకు మంచి వైద్యం అందించాలని కోరాడు. ఆసుపత్రిలో మౌళికవసతులు కల్పనకోసం కృషి చేస్తున్న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కోఆర్దినేటర్ కాకుటూరి లక్ష్మీసునందకు అన్నివిధాలుగా సహకారం అందించాలని కోరాడు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీఎస్ కోఆర్దినేటర్ కాకుటూరి లక్ష్మీసునంద, సిద్దానాయక్, ఏడీ డాక్టర్ కళారాణి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లి పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్ పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల బలోపేతానికి కార్యచరణపై చర్చ



**నెల్లూరు కార్పొరేషన్,మార్చి5,ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలోని గ్రామీణ,పట్టణ స్థానిక సంస్థల అవసరాలను అంచనా వేయడానికి ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి కార్యాచరణను సిద్ధం చేసేందుకు అవసరమైన సూచనలు అందించాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం కమిషన్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఎస్,రత్నకుమారి సూచించారు .నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో అన్ని విభాగాల ఉన్నతాధికారులతో చైర్‌పర్సన్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.ముందుగా నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్,ఐఏఎస్ చైర్‌పర్సన్‌ను పుష్ప గుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు.అనంతరం జరిగిన సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో రెవెన్యూ వసూళ్లు,ఖర్చులు,పన్నులు,ప్రాథమిక అవసరాల లభ్యత,కేంద్ర,రాష్ట్ర ప్రాయోజిత పథకాల్లో భాగస్వామ్యం తదితర అంశాలపై చర్చించారు.స్థానిక సంస్థల ఆర్థిక స్థితిని మెరుగుపచడానికి ,జవాబుదారితనం పెంచడానికి,ప్రణాళికేతర మూలధనాన్ని తీర్చడానికి,స్థానిక సంస్థల అవసరాలను అంచనా వేయడానికి అవసరమైన చర్యలు సూచించాలని కమిషరన్ తెలియజేశారు. సభ్యులు కృపాకర్‌రావు,ఎం.వి.ఎన్ పద్మారావు, నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి బాటలో పయనిస్తా !



**కావలి,మార్చి 5 ప్రభాతవార్త** రాజ్యసభ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బాటలో పయనిస్తూ అభిమానుల నిర్ణయానికి కట్టుబడి వుంటానని కావలి మాజీ ఎమ్మెల్యే, వైసిపి నేత వంటేరు వేణుగోపాలరెడ్డి తెలిపారు. దీంతో ఆయన తిరిగి టిడిపిలో చేరుతున్నట్లు ప్రచారమైంది. కావలి పట్టణంలోని బాపూజీనగర్‌లోని ఆయన కార్యాలయంలో మంగళవారం కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లోని అనుయాయులతో, అభిమానులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. తన రాజకీయ ఎదుగుదలకు వెన్నంటి వుంటూ సూచనలు, సలహాలు అందజేస్తున్న వారందరికి ధన్యవాదాలు తెలిపారు. 1994లో రాజకీయ ఆరంగ్రేటం చేయడం జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీ కావలి శాసనసభ్యులుగా ఆనాడు 20 వేల మెజార్టీతో విజయం సాధించానన్నారు. ఎమ్మెల్యేగా తాను కావలి పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించగలిగానన్న తృప్తి మిగిలిందన్నారు.పేదోళ్లకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న తపనతో కావలి ఏరియా వైద్యశాలను వంద పడకల వైద్యశాలగా ఏర్పాటు చేశానన్నారు. ఈ వైద్యశాలలో పనిచేస్తున్న వైద్యులు ప్రైవేట్ క్లినిక్‌లు పెట్టుకుని వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్న భావనకు రావడం జరిగిందన్నారు. వెంటనే ప్రభుత్వం నిర్ణయించిన వేళలలో విధిగా వైద్యులు పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలని ఆంక్షలు విధించడంతో ఆనాడు అందరికి వైద్యం అందిందన్నారు.కుక్క కాటుకు వ్యాక్సిన్ లేక ప్రజలు తల్లడిల్లుతున్న పరిస్థితులలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వ్యాక్సిన్ అందేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కావలిలో మినీ స్టేడియం ఏర్పాటు చేశామన్నారు. రైతులకు సాగునీరు అందించే క్రమంలో సోమశిల కాలువ పరిధిలోని రైతులకు సాగునీరు సదుపాయం కల్పించానన్నారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నిర్మించడం జరిగిందన్నారు. సోమశిల కాలువకు నిధులు సమకూర్చడం జరిగిందన్నారు.రామాయపట్నం పోర్టు ఏర్పాటుకు వేలాది మందితో పాదయాత్ర చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. 2014లో ఉదయగిరి ఆనాటి వైసిపి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి సూచనలతో టిడిపిని వదిలిపెట్టి వైసిపిలో చేరడం జరిగిందన్నారు. కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేల విజయానికి తన శక్తివంచన లేకుండా కృషి చేయడం జరిగిందన్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విజయానికి తనతో పాటు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రంధి యానాదిశెట్టిలు పాటుపడటం జరిగిందన్నారు. అయితే వైసిపిలో ఇరువురు ఎమ్మెల్యేలు తన రాజకీయ ప్రస్థానానికి ఎలాంటి సహకారం అందించలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైసిపి పార్టీలో సముచిత స్థానం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత వైసిపి ఉదయగిరి ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తనను ఇంతవరకు సంప్రదించలేదన్నారు. తాను అవసరం లేని ఈ వైసిపి పార్టీలో వుండటం కష్టంగా మారిందన్నారు. అందువల్ల ఆత్మీయులతో సమావేశం నిర్వహించి రాజకీయ నిర్ణయాన్ని ప్రకటించేందుకు చర్చలు జరపడం జరిగిందన్నారు. వైసిపి అగ్రనేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి,చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలు తనతో ఫోన్లలో సంప్రదిస్తున్నారన్నారు. అంతేకాకుండా తెలుగుదేశం పార్టీ పెద్దలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తదితరులు టచ్‌లో వున్నారన్నారు. రెండు రోజులలో తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని వంటేరు చెప్పడంతో టిడిపి పార్టీలో మళ్లీ చేరుతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. కావలి, ఉదయగిరి నియోజకవర్గాలలో వున్న వంటేరు అనుయాయు లందరూ మీ వెంటే మా పయనం అంటూ ప్రకటించారు.

# నేడు నెల్లూరుకు విజయసాయిరెడ్డి రాక

### రూరల్ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల
### ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డికి ఘనస్వాగతం పలికేందుకు తరలిరండి
### ఆదాల పిలుపు




**నెల్లూరు రూరల్,మార్చి5,ప్రభాతవార్త** నెల్లూరు పార్లమెంట్ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా నిర్ణయించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నిష్క్రమణలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు లోకసభ స్థానం నుండి వైసీపీ అభ్యర్థిగా రీజనల్ కోఆర్డినేటర్ వేణంబాక విజయసాయిరెడ్డిని నియమించడం జరిగిందని నెల్లూరు రేరల్ నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం జిల్లావైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.ఇకనుండి నెల్లూరు వైసీపీ విజయసాయిరెడ్డి నెల్లూరులోని ఉంటారని,నెల్లూరు నగరంలో రామ్మూర్తి నగరంలో నివాసం కూడా తీసుకోవడం జరిగిందని ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.ఈ మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి,నెల్లూరునగర మేయర్ పోట్లూరి ప్రసంతి జయవర్ధన్,నెల్లూరు నగరవైసీపీ ఇన్చార్జి మహమ్మద్ ఖలీల్ అహ్మద్,నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్,రాష్ట్ర పోలీస్ హౌసింగ్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి,నెల్లూరు ఏఎంసీ చైర్మన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి,కందుకూరు వైసీపీ పరిశీలకులు మన్నేమాల సుకుమార్‌రెడ్డి,కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్,మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఈ వీఎం మిషన్‌లపై శిక్షణా తరగతులు



**సైదాపురం, మార్చి 5, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన సైదాపురంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తహశీల్దార్ ప్రవీణ్‌కుమార్ డిప్యూటీ తహశీల్దార్ అనురాధ ఆధ్వర్యంలో సెక్టార్ ఆఫీసర్లకు, బీఎల్ఓలకు, ఈఆర్వోలకు ఏఎల్ఎంటీ వసుంధర్ ఈవీఎం మిషన్‌లపై మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించి వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ వెంకటేశ్వర్లు, సెక్టారు ఆఫీసర్లు పురుషొత్త శివకుమార్, హైమావతి, ఆదిశేషారెడ్డి, దయాకరరావు, శ్రీనివాసులు, ఎస్‌వీఎస్ శర్మ, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల హృదయాలలో గెలిచింది జగనన్నే



**చేజర్ల మార్చి 5 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రజా సంకల్పయాత్ర ను చేసి ప్రతి పేదవాడి కష్టాన్ని తెలుసుకొని ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమపాలన అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రశంసించారు. ఈ సందర్భంగా మంగళవారం నడిగడ్డ అగ్రహారం, మామూడురు గ్రామాలలో విజయిభవ యాత్రను నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతు మ్యానిపెస్టులో చెప్పిన ప్రతి హామిని 99 శాతం అమలుచేసిన ఘనత జగనన్నకు దక్కుతుందని అన్నారు. పేద ప్రజలకు అనేక సంక్షేమపథకాలను అందించారని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సచివాలయ,వాలింటరీ వ్యవస్థను తీసుకొని వచ్చి ప్రజా సమస్యలను పరిష్కరించే విషయంలో అద్భుతమైన చొరవ చూపుతున్నారని అన్నారు.రానున్న సార్వత్రిక ఎన్నికలలో మరోసారి జనన్నకు అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం మామూడురు గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం,రైతు భరోసా కేంద్రం ,ఆరోగ్య ఉపకేంద్రం,మిల్క్ సిల్లింగ్ సెంటర్‌లను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో వైసిపినాయకులు, జడ్పిటిసి సభ్యులు పీర్ల పార్ధసారది, పూనూరు రాంమనోహర్‌రెడ్డి, వైసిపినాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## గృహనిర్మాణంలో అవకతవకలు జరగలేదు - విష్ణు



**తోటపల్లిగూడూరు, మార్చి 5, ప్రభాతవార్త :** మండలంలోని వరిగొండ గ్రామంలో వైకాపా నేతలు లబ్దిదారులు మంగళవారం మీడియా సమావేశం నిర్వహించి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేసిన అవాస్తవ విమర్శలను తిప్పికొట్టారు. ఈ సందర్భంగా వైకాపా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు మండల పార్టీ అధ్యక్షులు ఉప్పల శంకర్ గౌడ్, వైకాపా సీనియర్ నేత కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో 13 ఎకరాలలో 600 ప్లాట్లు నిర్మాణంలో భాగంగా గిరిజనుల శ్రేయస్సు ను దృష్టిలో పెట్టుకుని అంచెలంచెలుగా పటిష్టంగా నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కాని వాస్తవాలు తెలియకుండా మాజీ మంత్రి కాకాణిపై అనుచిత వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. లబ్దిదారులు కూడా గృహాలు పటిష్టంగా నిర్మిస్తున్నారని తెలిపారు. గ్రామంలో సోమిరెడ్డి అనవసర చిచ్చు పెడుతున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఈగ సుబ్బరత్నమ్మ, వైకాపా నేతలు చిల్లకూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నెల్లిపూడి సునీల్‌కుమార్‌రెడ్డి, కోట శేఖర్‌రెడ్డి, జ్వాలా ముఖి దేవాలయ చైర్మన్ కోనూరు రవీంద్ర లబ్దిదారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కావ్య కృష్ణారెడ్డిని సత్కరించిన అలేఖ్య దంపతులు



**కావలి, మార్చి 5 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శిగా నియమితులైన కావలి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, ఆమె భర్త పోతుగంటి శ్రీకాంత్ దంపతులు టిడిపి కావలి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్ది కావ్య కృష్ణారెడ్డిని మంగళవారం ఘనంగా సత్కరించారు. కావలి ముసునూరులోని కావ్య నివాసానికి వెళ్లారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శిగా పదవి వచ్చేందుకు సహకరించిన కృష్ణారెడ్డికి అలేఖ్య దంపతులు ధన్యవాదాలు తెలిపారు. దుశ్శాలువతో సత్కరించి పూలబొకె అందజేశారు.

## ఎంపీ అభ్యర్ధి విజయసాయిరెడ్డిని కలిసిన పాముల రమణయ్య



**ఉదయగిరి,మార్చి5,ప్రభాతవార్త :** ఉదయగిరి మండలంలోని గండిపాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు,సీనియర్ వైసీపీ నాయకులు పాముల రమణయ్య తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో నెల్లూరు జిల్లా ఎంపీ అభ్యర్ధిగా పోటీ చేయనున్న విజయసాయిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరరాజకీయ చాణిక్యుడిగా పేరొందిన విజయసాయిరెడ్డిని నెల్లూరు ఎంపీ అభ్యర్ధిగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నుకోవడం సంతోషాన్నిచ్చిందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా నెల్లూరు రాజకీయ పరిస్థితులపై ఆయకు వివరించారు.రాబోయే రోజుల్లో ఎంపీ అభ్యర్ధిగా విజయసాయిరెడ్డిని ఉదయగిరి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్ధిగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించేందుకు పట్టుదలతో కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు సీతారామపురం మండలానికి చెందిన వైసీపీ నాయకులు గురవారెడ్డి,అల్లూరిరాజు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన కాటంరెడ్డి



**అల్లూరు, మార్చి 5 ప్రభాతవార్త :** అల్లూరులో బత్తల గోపాల్‌రెడ్డి, అల్లూరుపేటలో కొల్లకుదురు రామిరెడ్డిలు మృతి చెందగా వారి మృతదేహాలకు మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాటంరెడ్డి అనుచరులు పాల్గొన్నారు.

## రాక్షస పాలనకు చరమగీతం పాడాలి



**సైదాపురం, మార్చి5 , ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న వైసీపీ రాక్షస పాలనకు ప్రజలు రానున్న ఎన్నికల్లో చరమగీతం పాడాలని వెంకటరెడ్డి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని లింగసముద్రం, తోకలపూడి గ్రామంలో ఎన్నికల శంఖారావం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకులు జిన్ను రమణయ్య, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ఎన్నికల హామీ పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామ నాయకులు వెంకటకృష్ణరాజు ఆధ్వర్యంలో వారి సమక్షంలో వైసీపీ నుంచి సుమారు 50 మంది టీడీపీలోకి చేరారు. అనంతరం కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి మాత్రమే కనపడుతుందని, వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడా పిడికిడు మట్టి వేసిన పాపాన పోలేదని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతిపార్లమెంటు రైతు ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు, పార్టీ సీనియర్ నాయకులు రాజశేఖర్‌రాజు, కేపీ రాజు, బోయిన రమేష్, వెంకటకృష్ణరాజు, చందు, గంగాధర్, శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన రామిరెడ్డి



**అల్లూరు, మార్చి 5 ప్రభాతవార్త :** అల్లూరులో బత్తల గోపాల్‌రెడ్డి, అల్లూరుపేటలో కొల్లకుదురు రామిరెడ్డిలు మృతి చెందగా వారి కుటుంబాలను మంగళవారం కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమారెడ్డి పరామర్శించారు. ముందుగా బత్తల గోపాల్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అల్లూరుపేటలో కొల్లకుదురు రామిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట అల్లూరు నగర అధ్యక్షుడు దండా కృష్ణారెడ్డి, వైసిపి జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, మేడా శ్రీనివాసులురెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



**దుత్తలూరు,మార్చి5,ప్రభాతవార్త :** దుత్తలూరు మండలంలోని వైసీపీ నియోజకవర్గ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు.రానున్న ఎన్నికల్లో జిల్లాలో వైసీపీ విజయఢంకా మ్రోగిస్తుందని ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటిరాజగోపాల్‌రెడ్డి అన్నారు.నెల్లూరు పార్లమెంట్ అభ్యర్ధిగా విజయసాయిరెడ్డిని నియమించడం విజయానికి సంకేతమన్నారు.రేపు జిల్లాకు విజయసాయిరెడ్డి రానున్న సందర్భంగా కావాలిలో ఘనస్వాగతం పలికేందుకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని వైసీపీ నేతలకు పిలుపునిచ్చారు.ఈ మేరకు దుత్తలూరు వైసీపీ కార్యాలయంలో ఆయన వీడియో సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వింజమూరు జడ్పీటీసీ సభ్యులు బాలకృష్ణరెడ్డి,మాజీ ఏయంసీ చైర్మన్ ఆలీ అహ్మద్,వైసీపీ మండల కన్వీనర్ వాసుదెవరెడ్డి,వైసీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ముచ్చటగా మూడోసారి గెలిపిద్దాం...మంత్రిగా చేసుకుందాం !



**కావలి, మార్చి 5 ప్రభాతవార్త :** కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చాలా మంచి వ్యక్తి, ఎంతో సౌమ్యుడు ఇలాంటి వ్యక్తిని మూడో సారి ముచ్చటగా గెలిపించుకుని మంత్రిగా చేసుకుందామని వివిధ సంఘాల గౌరవాధ్యక్షులు, ఐయంఎ గౌరవ సలహాదారుడు డాక్టర్ బెజవాడ రవికుమార్, బిపిఎస్ సంస్థ అధినేత బెజవాడ ప్రకాష్‌రావు, పులగం ప్రసాదరావులు తెలిపారు. మంగళవారం కావలి కళుగోళమ్మపేట ప్రాంతంలో నివసిస్తున్న బిపిఎస్ సంస్థ అధినేత బెజవాడ ప్రకాష్‌రావు నివాసంలో గెట్‌టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయనకు భారీ స్వాగతం పలికి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం బెజవాడ సోదరులు మాట్లాడారు. కావలి ఎమ్మెల్యే తమ ఇంటికి వచ్చి గెట్‌టుగెదర్ నిర్వహించడం ఎంతో ఆనందంగా వుందని, ఎంతో గర్వంగా వుందని సంబర పడ్డారు. గర్వం లేని ప్రతాప్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. ఆయన మంత్రిగా బాధ్యతలు చేపడతారన్నారు. అందరిని కలగొలు పుకుని పోయే వ్యక్తి ప్రతాప్‌రెడ్డి అన్నారు.గతంలో మా నివాసానికి వచ్చారని ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. ఈసారి మళ్లీ రావడంతో మంత్రి అవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు కనమర్లపూడి వెంకట నారాయణ, దామిశెట్టి శ్రీనివాసులనాయుడు, దామిశెట్టి సుధీర్‌నాయుడు, కావలి మాజీ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కామంచి సుబ్బారావు, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, అయ్య వారు కృష్ణారెడ్డి, కావలి ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్, రెవెన్యూ ఉద్యోగి పొనుగోటి వెంకట్రామిరెడ్డి, సిఎస్ డిటి మలిశెట్టి సురేష్‌బాబు, కలవకూరి సుగుణకుమార్‌రెడ్డి, మండలి కృష్ణారావు, స్టాంప్ వెండర్ షేక్ చెన్నయ్య, కావలి పట్టణ 30వ వార్డు వైసిపి కన్వీనర్, గృహ సారధి,బూత్ లెవల్ ఏజెంట్ కేతిరెడ్డి బాలకృష్ణారెడ్డి, ఈ తముక్కల చందురెడ్డి,జనిగర్ల మహేంద్రయాదవ్, కాపు సోదరులు, బిపిఎస్ కాఫీ బ్యాచ్ బృందం పాల్గొంది.

## విజయసాయిరెడ్డిని కలిసిన జడ్పిటిసి మోడి రామాంజనేయులు



**ఉదయగిరి, మార్చి5, ప్రభాతవార్త:** మండలకేంద్రమైన ఉదయగిరి జడ్పీటిసి సభ్యులు మోడి రామాంజనేయులు నెల్లూరు జిల్లా వైసీపీ అభ్యర్ధి విజయ సాయిరెడ్డిని విజయవాడలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వ కంగా కలవడం జరిగింది.నెల్లూరు జిల్లా ఎంపీ అభ్యర్ధిగా వైసీఎ అధిష్టానం విజయసాయిరెడ్డిని ఎన్నుకున్నందుకు గాను ఆయనకు శాలువాకప్పి బోకే ఇచ్చి సన్మా నించామని తెలిపారు.ఈ మధ్యకాలంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలుగుదేశం పార్టీలోకి వెళ్లడం ద్వారా కొంత మంది వైసీపీ నాయకులు అదే బాటలో పయనించడం పార్టీ కార్యకర్తలు కొంతనిరాశ చెందిన సమయంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అనూహ్యంగా విజయసాయిరెడ్డి పేరును తెరమీదకు తీసుకుని రావడంతో వైసీపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారన్నారు.ట్రబుల్ షూటర్‌గా పేరొందిన విజయసాయిరెడ్డి రాజకీయ చదరంగంలో పాములు కదుపగల చాణిక్యుడని నెల్లూరు జిల్లాలో వైసీపీని గెలిపించే విధంగా ఆయన ఆదేశాలతో ముందుకు సాగుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 5న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నుంచి బీసీల బైక్ ర్యాలీ

**నెల్లూరు టౌన్, మార్చి 5, ప్రభాతవార్త :** ఈ నెల 5వ తేదీ బుధవారం సాయంత్రం 4గంటలకు బీసీ సంఘాల ఆధ్వర్యంలో నెల్లూరు నగరం మినీ బైపాస్ రోడ్డులోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి నర్తకి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ జరుగుతుందని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు ఒట్టూరు సంపత్ రాజు యాదవ్ మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నర్తకి సెంటర్‌లోని తెలుగుదేశం పార్టీవ్యవస్థాపకులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి వినతిపత్రం అందజేయడం జరుగుతుందని అన్నారు. బీసీ సంఘాల నాయకులు బీసీ సోదరులు బుధవారం మధ్యాహ్నం 3.30గంటలకు పూలే విగ్రహం వద్ద చేరుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## వృద్దుల పోషణ, సంరక్షణ కోసం చట్టం ఉంది




**నెల్లూరు టౌన్, మార్చి 5, ప్రభాతవార్త :** వృద్ధాప్యంలో వారి పిల్లలు నిర్లక్ష్యం చేయకుండా ఉండేందుకు ప్రభుత్వాలు 2007 సంవత్సరంలో వృద్దుల పోషణ సంరక్షణ చట్టం తీసుకొని రావడం జరిగిందని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కే.వాణి తెలిపారు. నెల్లూరు నగర పరిధిలోని నవలాకుల గార్డెన్స్, దొరతోపు కాలనీలోని నేతాజీ వృద్దుల ఆశ్రమంలో మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.వాణి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆశ్రమంలో వృద్దులతో మాట్లాడారు. యోగక్షేమాలు ఆశ్రమంలో అందుతున్న సౌకర్యాలు ఎలా ఉన్నాయో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సదస్సులో వాణి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లో అయిన తల్లిదండ్రుల రక్షణ మరియు పోషణ తల్లిదండ్రులను కుటుంబంలోని ఇతర వయోవృద్దులను వృద్దాప్యంలో నిర్లక్ష్యం చేయడం హేయకరమైన చర్యగా ఆమె పేర్కొన్నారు. వృద్దులను నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని అన్నారు. అందుకు ప్రత్యేక చట్టాన్ని ప్రభుత్వం తీసుకురావడం జరిగిందన్నారు. చాలా మంది తల్లిదండ్రులను వృద్దులను సీనియర్ పౌరులను వారి బిడ్డలు, బంధువులు నిర్లక్ష్యం చేయడం వంటి నుండి, బయటకు గెంటి వేయడం జరుగుతుందని వృద్దాప్యంలో ఇలాంటి వారి రక్షణ కోసం 2007 సంవత్సరంలో తల్లిదండ్రుల సీనియర్ సిటిజన్ల పోషణ సంక్షేమ చట్టం అమలుల్లోకి వచ్చిందని తెలిపారు. సీనియర్ సిటిజన్లకు ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎస్ఏ రావూస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మేల్యేగా గెలిచి రాపూరును అభివృద్దిలో పరుగులు పెట్టిస్తా



**రాపూరు,మార్చి05ప్రభాతవార్త :** తాను ఎమ్మేల్యేగా గెలిచిన వెంటనే రాపూరు మండలాన్ని అభివృద్దిలో పరుగులు పెట్టిస్తానని తిరుపతిజిల్లా వైసిపి అధ్యక్షుడు,రాష్ట కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్,వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం రాపూరులోని తెలుగుగుంగ అతిథగృహంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా గడప గడపకు పర్యటిస్తున్న రాపూరువీదులు,సందులలో పరిస్దితి చూస్తూంటే కనీస మౌళిక వసతులు కూడా లేకపోవడం ఆచ్చర్యం కల్గిస్తుందన్నారు.కాలువలు లేక పోగా వున్న కొద్ది కాలువలలోనే తాగునీటి పైపులు వుండటం గమనించడం జరుగిందన్నారు.రాపూరులోఎక్కడికి వెల్లినా అక్కడ సమస్యలు పేరుకోపోయివున్నాయన్నారు. వీటిని చూసి తనకు ఆచ్చర్యం కలిగిందన్నారు.40 ఎళ్ళుగా రాపూరుతోనే తనకు అనుభందం అన్న ఎమ్మేల్యే ఆనం రామనారాయణ రెడ్డి ఇక్కడ ప్రజలకుఎమి చేశారన్నారు. కనీసం రోడ్లు,కాలువులు,తాగునీటి వసతి వంటి సౌకర్యాలు కూడా కల్పించకుండా కేవలంతన స్వార్ధం కోసం రాజకీయం చేశాడన్నారు. ప్రధానంగా ఆయన మూడు పర్యాయాలు మంత్రిగా,అనేక సంవత్సరాలుఎమ్మేల్యేగా రాపూరుకు చేసిన అభివృద్ది ఎమిటి అంటే ఒక్క పశుసంవర్ధక శాఖ పాలిటెక్నిక్ కళాశాలే అన్నారు.దీంతో పాటు రాపూరులో పేదలకు ఇళ్ల స్ధలాలకు ఎంపిక జరిగిన తరువాత వారికి పట్టాలు ఇవ్వలేదంటూ తనదృష్టికి వచ్చిందన్నారు. దిన్ని విచారిస్తే ఇక్కడ ఆనం హయంలో పెత్తనం చేస్తున్న చెన్ను వారు ప్రజలకు ఇంటిస్ధలాలు రాకుండా చేశారన్నారు. డక్కిలిలో ఆల్తూరుపాడు రిజర్వాయర్‌కు కాంట్రాక్టర్ వాటా ఇవ్వకపోవడంతో చెరువులలో మట్టి ఎత్తేందుకు లేదంటూ ఆ ప్రాంతంలో రైతుల మెడపై కత్తి పెట్టి వారిచేత మట్టి ఎత్తేందుకు వీలు లేదు అని చెప్పించాడన్నారు. ఆయన తన స్వార్ధం కోసం ఈ ప్రాంత వాసులకు తీవ్ర అన్యాయం చేశాడన్నారు.తాను ఎమ్మేల్యేగా వచ్చే ఎన్నికలలో గెలుపోందిన తరువాత ఒక ప్రణాళిక ప్రకారం ఈ ప్రాంతాన్ని అభివృద్దిలోపరుగులు పెట్టిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు మండల పార్టీ కన్వినర్ పాపకన్ను దయాకర్ రెడ్డి,జెసిఎస్ కన్వినర్ దందోలు నారాయణ రెడ్డి, వైస్ యంపీపీ పోలంరెడ్డి పెంచల రెడ్డి,నాయకులు ఏటూరు విజయ శేఖర్ రెడ్డి,ఆల్తాప్‌బేగ్,వంకివోలు కోటేశ్వర రెడ్డి, గడ్డం వెంకటరమణా రెడ్డి,అబ్ధుల్ ఘని తదితరులున్నారు.

## రాజ్యసభ సభ్యులు పార్లమెంట్ అభ్యర్ధి విజయసాయిరెడ్డిని కలిసిన ఎంపీపీ జయంత్‌రెడ్డి



**దుత్తలూరు,మార్చి5,ప్రభాతవార్త :** దుత్తలూరు మండల ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి,మాజీ కమ్మవారిపాలెం సొసైటీ అధ్యక్షులు చేజర్ల చాలామరెడ్డి,మాజీ మండల కన్వీనర్ వాసుపల్లి వెంకటేశ్వర్లురెడ్డి,తాడేపల్లి లోని సిఎంఒ కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు,నెల్లూరు పార్లమెంట్ అభ్యర్ధిగా గౌరవ ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని ఎన్నుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ శుభాకంక్షలు తెలిపారు.

## కాకర్ల సురేష్‌ను కలిసిన తెలుగుదేశం పార్టీ తమ్ముళ్లు



**ఉదయగిరి,మార్చి5,ప్రభాతవార్త :** మండలకేంద్రమైన ఉదయగిరిలోని వెంగలరావునగర్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ అభిమానులు,కార్యకర్తలు ఉదయగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్ధి కాకర్ల సురేష్‌ను పార్టీ కార్యాలయంలో కలవడం జరిగిందని తెలుగుదేశం పార్టీ కార్యకర్త బచ్చల వెంగయ్య తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాకర్ల సురేష్ అధ్యక్షతన కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు యువత తెలుగుదేశం పార్టీ గెలుపుకొరకు కృషిచేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు.రాజకీయ విమర్శలను ప్రత్యర్ధుల మాటలను పట్టించుకోకుండా తాను అనుకున్న లక్ష్యంవైపు దూసుకుపోతున్న కాకర్ల సురేష్ అన్న గెలుపు తథ్యమని అన్నారు.ఇప్పటికే నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలతో ప్రజలకు ఎంతగానో దగ్గరైన కాకర్ల సురేష్ అన్న మునుముందు రోజుల్లో ఉదయగిరి నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కొరకు కృషి చేస్తాను అనడంలో ఎలాంటి సందేహంలేదన్నారు.ఈ కార్యక్రమంలో వెంగలరావునగర్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## మెతుకు రాజేశ్వరి కుటుంబాన్ని పరామర్శించిన కావ్య కృష్ణారెడ్డి



**బిట్రగుంట, మార్చి 5 ప్రభాతవార్త :** కాపు సంఘం నేత మెతుకు రాజేశ్వరి కుటుంబాన్ని మంగళవారం కావలి నియోజకవర్గ టిడిపి అభ్యర్ధి కావ్య కృష్ణారెడ్డి పరామర్శించారు. రాజేశ్వరి భర్త మెతుకు రమేష్ అనారోగ్య కారణాలతో సోమవారం మృతి చెందగా ఆయన అంత్య క్రియలలో కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారి కుటుం బానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట మండల టిడిపి అధ్యక్షులు యం.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎల్.సుధీర్‌బాబు, పలువురు నేతలు పాల్గొన్నారు.

## జయహో బిసి సభకు తరలిన తెలుగుతమ్ముళ్లు



**వరికుంటపాడు, మార్చి 5, ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ అభ్యర్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, నిరంతరం విశిష్ట సేవలందిస్తున్న సేవామూర్తి కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో మండలంలోని తెలుగు దేశం పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తిమ్మారెడ్డిపల్లి సెంటర్ వద్ద ఉన్న పార్టీ కార్యాలయం నుండి జయహో బిసి సభకు తరలివెళ్ళారు. మంఘళవారం మంగళగిరి సమీపంలోని నంబూరు వద్ద జరిగిన జయహో బిసి డిక్లరేషన్ మహాసభకు బిసి నాయకులు పదుల సంఖ్యలో తరలివెళ్ళారు. జై తెలుగుదేశం, జై చంద్రబాబు, జై కాకర్ల సురేష్ అంటూ నినాదాలతో హోరెత్తిస్తు నేతలందరూ వాహనాల్లో పయనమయ్యారు. ఉదయగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్ధి కాకర్ల సురేష్ ను అఖండమెజారిటితో గెలిపించుకుంటామని బిసి నేతలు తెలిపారు. ఈ కార్యక్రమములో మండల బిసి సెల్ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ వీపిఆర్ సోదరి మృతి బాధాకరం

**నెల్లూరు మార్చి 5, ప్రభాతవార్త-వైద్యం :** రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరి ఆకస్మిక మృతి చెందడం బాధాకరమని తెలుగుదేశం పార్టీ కోవూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డిలు తెలిపారు. ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## పోలంరెడ్డి నివాళులు



**కోవూరు, మార్చి 5 ప్రభాతవార్త :** రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరి సోమవారం మృతిచెందారు. ఈ మేరకు రామ్మూర్తి నగర్‌లోని ఆమె నివాసంలో ఆమె పార్థివదేహానికి కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి సోదరుడు ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు మల్లారెడ్డి, సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, బాలరవి, కృష్ణచైతన్య, తదితరులు ఉన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజల్లో మరింత అవగాహన



**పడుగుపాడు(కోవూరు), మార్చి 5 ప్రభాతవార్త :** జగనన్న ఆరోగ్య సురక్ష-2 పథకంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచేలా వలంటీర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీడీవో శ్రీ రామాంజనేయులు అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ సమావేశ మందిరంలో వలంటీర్లుకు జగనన్న ఆరోగ్య సురక్ష-2పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇటువంటి మంచి పథకాన్ని ప్రజలు కూడా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదు మంది స్పెషలిస్ట్ వైద్యులు ఈ శిబిరంలో పాల్గొంటారని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు ఈ శిబిరాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అహ్మద్, జలజీవన్ మిషన్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, తదితరులు ఉన్నారు.

## రామ్‌చరణ్ పుట్టినరోజు పురస్కరించుకొని రక్తదాన శిబిరం



**బుచ్చి ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** ఈ నెల 10 వ రామ్‌చరణ్ పుట్టి నరోజు సందర్భంగా ఉదయం 10 గంటలకు పద్మావతి కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు జనసేన మండలపార్టీ అద్యక్షులు మాదవ్ తెలిపారు. మండలంలోని మెగా కుటుంబం అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గోని ఈ కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని ఆయన కోరారు.

## 'దేశం' ముఖ్య నేతలతో కాకర్ల భేటి



**వింజమూరు, మార్చి5, ప్రభాతవార్త :** ఉదయగిరి తెలుగు దేశంపార్టీ అభ్యర్థి కాకర్ల సురేష్ జిల్లాలోని తెలుగుదేశంపార్టీ ముఖ్యనేతలు, మాజీమంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలను మంగళవారం వారి వారి నివాసాల్లో కలిశారు. రానున్న ఎన్నికల్లో తన గెలుపుకు సహాయ సహకారాలు అందించాలని దాంతో ఉదయగిరి కోటపై తెలుగుదేశం జెండాను ఎగురవేయడం ఖాయమని, టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా తన గెలుపు సునాయాసంగా ఉంటుందని కాకర్ల ధీమా వ్యక్తం చేశారు.

## చీకట్లోలో వుంటున్న హరిజనపాలెం వాసులకు పసుపులేటి ఎల్ఇడి లైట్లు అందజేత



**బిట్రగుంట, మార్చి 5 ప్రభాతవార్త :** బోగోలు మండలం పాతబిట్రగుంట హరిజనవాడలో వీధి దీపాలు లేక చిమ్మచీకట్లో ఆ ప్రాంత వాసులు గడుపుతున్నారు. నెలలు తరబడి వీధి దీపాలు లేక అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు పంచాయతీ అధికారులకు, స్థానిక సర్పంచ్ దృష్టికి తీసుకుపోయినా ఫలితం శూన్యమని తెలిపారు. విద్యుత్ దీపాలు లేక అవస్థలు పడుతున్నామని పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్‌కు తెలియజేయగా వారి సోదరుడు పసుపులేటి వెంకటేశ్వర్లు ఎల్ఇడి లైట్లు అందజేశారు.

## వేసవిలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



**కోవూరు, మార్చి 5 ప్రభాతవార్త :** దీర్ఘకాలిక రోగాలతో బాధ పడుతున్న వారు ఈ వేసవి సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిరంజన్ తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం వైఎస్సార్ ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ , షుగర్ లాంటి వ్యాధులు ఉన్న వారు ఈ వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా క్రమం తప్పకుండా మందులు వాడుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ప్రస్తుతం నడక, వ్యాయామం వంటి వాటిని చేయడం వలన కొన్ని రకాల రోగాలను నయం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడాలి




**కావలి రూరల్, మార్చి 5 ప్రభాతవార్త :** మహిళల హక్కులను కాలరాస్తూ దాడులను, హింసలను ప్రేరేపిస్తున్న మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడాలని స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఎల్.శ్యామల తెలిపారు. ఈ నెల 8వ తేది అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జెడ్పీ బాలికల హైస్కూలులో పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు ఎ.యం.వి.శేషమ్మ అధ్యక్షతన స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా న్యాయవాది సాయిప్రసాద్, ఎఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఎల్.లక్ష్మిరెడ్డి, మహిళా టీచర్లు పాల్గొని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని తెలిపారు. ఎల్.శ్యామల మాట్లాడుతూ ఈ నెల 8వ తేది జరుపుకుంటున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురించి వివరించారు. మహిళలు, బాలికలపై దాడులను, హింసలను ప్రేరేపిస్తున్న సినిమాలు, టివిలు, సెల్‌ఫోన్‌లలో వచ్చే విష సంస్కృతి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. దేశంలో అన్ని రంగాలలో తీవ్రమవుతున్న సంక్షోభంతో మహిళల జీవనం మరింత కష్టమవుతుందన్నారు. పేదరికం వంటి సమస్యలతో పాటు పితృస్వామిక అణిచివేత, పెరుగుతున్న సాంస్కృతిక విధ్వంసం మహిళలకు, బాలికలకు ఎక్కడా రక్షణ లేకుండా చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితురాలుకు ఆర్ధిక సహాయం చేసిన వాకర్స్



**కావలి రూరల్, మార్చి 5 ప్రభాతవార్త :** బెస్ట్ వాకర్స్ సభ్యులు బోగోలు మండలం ముంగమూరు గ్రామానికి చెందిన ఎస్.కె.బీబీజాన్ రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతూ ఎంతో ఇబ్బందులు పడుతుండటంతో ఆమెకు మంగళవారం మన వాకర్స్ తరపున 10 వేల 500 రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఎస్.కె.బీబీజాన్ మన వాకర్స్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన వాకర్స్ అధ్యక్షులు టి.వి.శేషయ్య, సభ్యులు నల్లపరెడ్డి శ్రీనివాసులు, మంద వెంకటేశ్వర్లు, భాస్కర్‌నాయుడు, రమేష్, బత్తిన శ్రీనివాసులు, సత్యానందం, బుజ్జి గోపాల్, ప్రేమ్‌కుమార్, ఆర్టీసీ బాషా, తదితరులు పాల్గొన్నారు.

## సీహెచ్‌సీలో ప్రయోగశాల పరిశీలన



**కోవూరు, మార్చి 5 ప్రభాతవార్త :** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ప్రయోగశాలను మంగళవారం లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌వలి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రయోగశాలలో పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రయోగశాలకు రక్త, మల మూత్ర పరీక్షలకు వచ్చే వారికి స్వాంతన చేకూర్చడమే కాకుండా సకాలంలో పరీక్షలు నిర్వహించి వారికి నివేదికలు అందజేయాలన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం జిల్లాలో క్షయ వ్యాధి రేటు క్రమంగా తగ్గుముఖం పట్టిందన్నారు. ఇందుకు ప్రధాన కారణం ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచేలా చర్యలు తీసుకోవడమే కాకుండా ప్రత్యక్ష పర్యవేక్షణ ద్వారా ఈ వ్యాధి సోకిన వారికి క్రమం తప్పకుండా మందులు అందజేయడం వలన ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రయోగశాలలో పరీక్షలు నిర్వహిస్తున్న టెక్నీషియన్లకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే కేంద్రాన్ని కూడా పరిశీలించి రోజుకు ఎన్ని ఎక్స్‌రేలు తీస్తున్నారు అనే విషయాలపై ఆయన వాకబ్ చేశారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రంలోని పరిస్థితులపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజేత, వైద్యులు డాక్టర్ వెంకటాచలపతి గౌడ్, డాక్టర్ పెంచలయ్యతో ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీఎం సత్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ కిషోర్, తదితరులు ఉన్నారు.

## ఊటుకూరు హైస్కూల్ నందు సరస్వతి పూజ



**సైదాపురం, మార్చి 5, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీఎస్ శర్మ అధ్యక్షతన మంగళవారం సరస్వతి పూజా కార్యక్రమం నిర్వహించి విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మండల ఏవో పురుషోత్తం శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ యువ బాలు, షఫీ హరన్‌లు విద్యార్థులకు జామెంట్రి బాక్సులు, పెన్నులు, ప్యాడ్స్ అందించారు. అనంతరం ఏవో పురుషోత్తం శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు వినయం, విధేయత, సమయపాలన ముఖ్యమమన్నారు. ఈ విద్యాసంవత్సరంలో పదో తరగతి, తొమ్మిదో తరగతిలో ప్రధమ, ద్వితీయ స్థానంలో వచ్చిన విద్యార్థులకు దాదాపు రూ.20వేలకు బహుమతులు ఇస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలరావు, సీనియర్ న్యాయవాది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పల్స్‌పోలియో విజయవంతం



**కోవూరు, మార్చి 5 ప్రభాతవార్త :** జిల్లాలో మూడు రోజుల పాటు నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతం అయిందని జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌వలి తెలిపారు. కోవూరు మండలం నేతాజీనగర్, తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆది, సోమవారం చుక్కలు వేసుకోకుండా ఉండే వారికి చుక్కలు వేసే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల సమిష్టి కృషి జిల్లా అధికారుల ఆదేశాల ప్రకారం జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతం అయిందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని పుట్టిన బిడ్డల నుంచి 5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలు వేసి విజయవంతం చేశారని, ఇందుకు వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న హెల్త్ అసిస్టెంట్ చెరుకూరి



**కావలి రూరల్, మార్చి 5 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం సర్వాయపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చెరుకూరు ప్రభాకర్‌రావు రోడ్డు ప్రమాదంలో చిక్కుకున్న పసుపులేటి శ్రీనివాసులను కాపాడి మానవత్వం చాటుకున్నారు. సర్వాయపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్‌పోలియో విధులు నిర్వహించుకుని ఇంటికి వస్తున్న చెరుకూరు ప్రభాకర్ కావలి మద్దూరుపాడుపై ఓవర్ బ్రిడ్జి వద్ద ద్విచక్రవాహనదారుడు పసుపులేటి శ్రీనివాసులు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో పడి వుండటాన్ని గుర్తించి వెంటనే ప్రథమ చికిత్స చేసి 108 అంబులెన్స్‌లో కావలి ఏరియా వైద్యశాలకు దగ్గరుండి తరలించి వైద్య సేవలు చేయించారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

## గ్రామీణ మహిళ ఉపాధి అవగాహన సదస్సు

**బిట్రగుంట, మార్చి 5 ప్రభాతవార్త :** బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీలో అక్షయ ఉమెన్ అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామీణ మహిళలకు ఉపాధిపై అవగాహన సదస్సును నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు జి.బాలశైలజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పర్యావరణ నెట్‌వర్క్‌కు చెందిన విజయబాబు మాట్లాడుతూ మహిళలు తమ స్వశక్తితో టైలరింగ్ వంటి ఉపాధికి ఉపయోగపడే వాటిపై దృష్టి పెట్టి స్వయం ఉపాధి పొందవచ్చునని తెలిపారు. అవార్డు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు.

## తాళ్లపూడిలో అభివృద్ధి ఓర్వలేకే సోమిరెడ్డి చిందులు




**ముత్తుకూరు, మార్చి5, ప్రభాతవార్త :** మండలంలోని తాళ్లపూడి పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులను ఒర్వలేకే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చిందులు వేస్తున్నారని వైసీపీ మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపురెడ్డి అన్నారు. ఈ రోజు మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపురెడ్డి మాట్లాడుతూ జరిగిన అభివృద్ధి కళ్లకి కనబడటంతో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించి ఆ పంచాయతీలో ఏమైనా ఉంటే ప్రజలకు తెలియ జేస్తామనుకున్నాడని అక్కడ ఏమి లేకపోవడంతో ఏదో ఒక విధంగా బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నా రన్నారు. నియోజకవర్గంలో 4సార్లు ఓడిపోయి రాజకీయ సన్యాసం తీసుకోకుండా కాకాణి గోవర్ధన్‌రెడ్డిపైన, మండ కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డిపైన విమర్శలుచేమడం ఆయనకు ఎంతవరకు సమంజస మన్నారు. టికెట్టు రాలేదని మనస్థాపంలో నియోజకవర్గంలో నానా చాజీరు చేస్తున్నారు. యాష్‌పాండ్‌లో ముడుపులు, పోర్టు దగ్గర ముడుపులు, పామాయిల్ ఫ్యాక్టరీల వద్ద ముడుపులు తీసుకునే వ్యక్తి మా నాయకులను విమర్శిస్తాడా సర్వేపల్లి నియోజకవర్గాని అభివృద్ధి బాటలో నడిపించిన ఏకైక వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాత్రమేనన్నారు. మా హయాంలో జరిగిన అభివృద్ధి, మీహయాంలో జరిగిన అభివృద్ధి గురించి చర్చించేందుకు బహిరంగసభకు సిద్ధంగా ఉన్నారు. మీరు ఎన్ని అవాక్కులు, చవాక్కుల పేలినా వైసీపీ అధాకారంలోకి రావడం తధ్యమని, ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి, శాసనసభ్యులుగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి విజయ ధుంధుబి మోగించడం ఖాయమన్నారు. తాళ్లపూడి ఉపసర్పంచ్ ఆల్లంపాటి మాట్లాడుతూ మా పంచాయతీకి వచ్చినప్పుడు వీధిలైట్లు, సిమెంట్‌రోడ్డు, డ్రైన్లు చూసి ఓర్వలేక ఆక్రోషంతో మా నాయకులపై ధ్వజమెత్తడం ఆయనకు ఎంతవరకు సమంజసమన్నారు. మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి మా పంచాయతీని అభివృద్ధి కోసం వ్యవసాయశాఖమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అభివృద్ధి చేస్తే ఈయన గ్రామాల్లో చిచ్చుపెట్టడానికి తగునమ్మా అంటూ వస్తున్నాడని ఆయన అన్నారు. గతంలో కూడా మా గ్రామంలో పర్యటించి అభివృద్ధి చేయకపోయినా చేసినట్లు ప్రచారం చేశారని దాన్ని అప్పట్లో మేము పూర్తిగా ఖండించామన్నారు. సోమిరెడ్డి ఇప్పటికైన కళ్లుతెరిచి సర్వేపల్లిలో జరిగిన అభివృద్ధిని చూడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు నెల్లూరు శివప్రసాద్, గండవరం సూరి, హరికృష్ణ, రాజా, సుధీర్, రాగాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## భూమి సంబంధిత సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



**నెల్లూరు అర్బన్, మార్చి5, ప్రభాతవార్త :** రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి లవన్నకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముక్కు రాధాకృష్ణ గౌడ్ వినతిపత్రం అందజేసి రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో సోమవారం నాడు స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజల నుండి విరివిగా అర్జీలు వస్తున్నాయని, వాటిని సంబంధిత అధికారులు పరిశీలించాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే సమస్యల పరిష్కారం కోసం అర్డీఓ స్థాయి అధికారిని నియమించాలని, తహశీల్దార్ కార్యాలయంలో పోలాలు, స్థలాలు, భూ సంబంధిత సమస్యలు ఎక్కువగాఉన్నాయని, వాటి కోసం అర్ధిదారులు మండల, జిల్లా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారని, వారికి మండల కేంద్రాల్లోనే పరిష్కారమార్గాలు చూపాలన్నారు. ఇతర సమస్యలను పరిశీలించడం, పరిష్కారదిశగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోదూరు దినేష్ నాయుడు, కార్యదర్శి దామెర్ల శివప్రసాద్, సహాయ కార్యదర్శి గంజం పెంచలప్రసాద్, కోశాధికారి కోసూరు సుధీర్, కార్యవర్గ సభ్యులు తాళ్ళపెంచలకుమార్ గౌడ్, సిహెచ్ నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధం సభను జయప్రదం చేయండి



**ఆత్మకూరు, మార్చి5, ప్రభాతవార్త :** ఆత్మకూరులోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సిద్ధం సభకు సంబంధించి జెసియెస్ కన్వీనర్లకు పార్టీ కార్యాలయం వాళ్ళు అందజేసిన ప్రచార సామాగ్రిని ఎమ్మెల్యే మేకపాటి అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి ఎక్కువమంది కార్యకర్తలు సిద్ధం సభకు తరలి వచ్చేలా నాయకులు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన సిద్ధం సభల కంటే మేదరమెట్ల సభ చరిత్రలో నిలిచిపోయేలా అత్యధిక సంఖ్యలో జనసమీకరణ చేసి ఇక్కడి నుండి బయలుదేరి వెళ్ళేలా చూడాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి అందజేసిన సంక్షేమ పాలన ప్రజలందరికీ మళ్ళీ గుర్తుకు వచ్చేలా సిద్ధం సభను జయప్రదం చేయాలన్నారు.

## కొండబిట్రగుంటలో ఉభయకర్తలతో సమావేశం



**బిట్రగుంట, మార్చి 5 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థాన సమావేశ మందిరంలో మంగళవారం బ్రహ్మోత్సవాల ఉభయకర్తలతో సమావేశం జరిగింది. ఈ నెల 19 నుండి 25వ తేది వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలలో నిర్వహించే ఉత్సవాలకు ఉభయకర్తలు సకాలంలో హాజరై భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ నిర్వహించేందుకు సహకరించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి అరవ రాధాకృష్ణ తెలిపారు. దేవస్థాన నిబంధనల మేరకు ఉత్సవాలకు సంబంధించి ఉభయకర్తలు ఖర్చులు భరించాల్సి వుంటుందన్నారు. ఆలయ ప్రధానాచార్యులు ఈపూరు సత్యనారాయణాచార్యులు మాట్లాడుతూ ఉభయకర్తలకు ఆగమ శాస్త్ర నిబంధనలు గురించి వివరించారు. ఈ సమావేశంలో కావలి మాజీ ఎయంసి చైర్మన్ దేవరాల సుబ్రమణ్యం, పలువురు ఉభయకర్తలు పాల్గొన్నారు.

## పేద మహిళల ఆర్థిక స్వయం సమృద్ధి సాధనే మహిళా మార్ట్ లక్ష్యం



**కావలి, మార్చి 5 ప్రభాతవార్త** పట్టణ పేద మహిళల ఆర్థిక స్వయం సమృద్ధి సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం జగనన్న మహిళా మార్ట్ మరో వినూత్న కార్యక్రమం చేపట్టిందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కు మార్‌రెడ్డి తెలిపారు. కావలి పట్టణ అన్నక్యాంటిన్‌లో నూతనంగా జగనన్న మహిళా మార్ట్‌ను మంగళవారం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ జగనన్న మహిళా మార్ట్ దినదినాభివృద్ధి చెంది ఆర్థిక స్వావలంబన వైపు మహిళలు పయనించాలని అందుకు తాను 5 లక్షల రూపాయలు విరాళం అందజేస్తున్నానని మహిళల హర్షధ్వానాల మధ్య నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్వాక్రా మహిళలే యజమానులుగా జగనన్న మహిళా మార్ట్ పేరుతో సూపర్‌మార్కెట్లను ఏర్పాటు చేసుకున్నారన్నారు. పట్టణ సమాఖ్యల సభ్యుల పొదుపు మొత్తాలే పెట్టుబడిగా పెట్టి వినూత్న కోణంలో వ్యాపారాన్ని నడుపుతున్నారన్నారు. పురపాలక శాఖ మౌలిక వసతులు సమకూర్చేలా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆర్థిక సహకారంతో ఈ జగనన్న మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.రవీంద్రలు మాట్లాడుతూ ఇప్పటికే వైఎస్ఆర్ జిల్లా పులివెందలలో పైలెట్ ప్రాజెక్టుగా ఏర్పాటు చేసిన జగనన్న మహిళా మార్ట్ ఎంతో విజయవంతమైందన్నారు. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, మున్సిపాల్టీలలో దశల వారీగా ఈ మార్ట్‌లను ఏర్పాటు చేయాలని మెప్మా నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు కనమర్లపూడి వెంకట నారాయణ, పందిటి కామరాజు, దామిశెట్టి సుధీర్‌నాయుడు, గంధం ప్రసన్నాంజనేయులు, కనపర్తి రాజశేఖర్, దేగా రాము యాదవ్, ఆర్కే దాబా అధినేత ఆర్.కె.కృష్ణారెడ్డి, దామెర్ల నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు. మెప్మా సిబ్బంది ఎమ్మెల్యేకు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.

## ఒబీసీలకి 27 కేంద్ర మంత్రిత్వశాఖలను కేటాయించిన మోదీ



**నెల్లూరు మార్చి 5, ప్రభాతవార్త-వైద్యం** ఒబీసీల అభ్యున్నతికి పాటుప డుతోన్న చరిత్రలో ఏకైక ప్రధానమంత్రి నరేంద్రమోదీ అని, అందుకు నిదర్శనం ఒబీసీలకు 5 కేబినెట్ ర్యాంక్ సహా 27 కేంద్ర మంత్రిత్వశాఖలను కేటాయించిన ఘనుడని భారతీయ జనతాపార్టీ ఒబీసీమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగరాల సురేష్ కొనియాడాడు. మంగళవారం నగరంలోని వేదాయపాళెంలోని మొగరాల నివాసంలో విలేఖరులతో మాట్లాడాడు. ఒబీసీల ప్రతి కుటుంబం అభివృద్ధిలోకి రావాలనే ఆలోచనతో ప్రాథమిక పాఠశాల నుంచి యూనివర్శిటీ వరకు వారికి 27శాతం రిజర్వేషన్‌ని అందించాడన్నాడు. ఆయన చేస్తున్న సేవలు రాష్ట్రవ్యాప్తంగా తెలియచేసేందుకు ప్రతి జిల్లాలో బిసీ సామాజిక సమావేశాలు ఏర్పాటుచేస్తున్నామన్నాడు. అన్ని బిసీ కులాలను కలుపుకుని కులాలతో సామాజిక సమావేశానికి ప్రతి హాస్టల్, డిగ్రీ కళాశాలలు యూనివర్శిటీల్లో నూతన విద్యార్థులతో యువజన సంఘాలతో సామాజిక సమావేశాలకు ఒబీసీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపిశ్రీనివాస్ పిలుపునిచ్చాడన్నాడు. దేశంలో బిసీలకు అండగా బీజేపీ మాత్రమే ఉందని, అందులో ఎలాంటి అతిశయోక్తిలేదన్నాడు. ఒబీసీ కమిషన్‌కి చట్టబద్ధత చేసి మోదీ ప్రభుత్వం జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌కి రాజ్యాంగహోదా కల్పించిందన్నాడు. ఒబీసీలనై మాజీప్రధాని చౌదరి చరణ్‌సింగ్, జన్-నాయక్ కర్పూరీ ఠాకూర్‌లకు ప్రతిష్టాత్మకమైన భారతరత్నను ప్రదానం చేసిందన్నాడు. విశ్వయోజన పథకంతో 30లక్షల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయనుందని ఆయన తెలిపాడు. 127వ రాజ్యాంగ సవరణతో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఒబీసీల జాబితాను సిద్ధంచేసే అధికారం కల్పించాడని వివరించాడు. నేషనల్ బ్యాంక్ వర్డ్ క్లాసెస్ ఫైనాన్స్ దెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి ఒబీసీలకు పారిశ్రామిక వ్యాపారవేత్తలకు ఆర్థిక సహాయం కోసం రూ.106,28కోట్ల వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటుచేశారని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపాడు. ఒబీసీ సాధికారత దిశగా మోదీ పనిచేస్తున్నాడని, ఒబీసీ నిర్వహించే సామాజిక సమావేశాలు, హాస్టల్‌లలో నిర్వహించే సమావేశాలను ప్రధానికి మద్ధతుగా విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చాడు.

## పేదల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం



**నెల్లూరు మార్చి 5, ప్రభాతవార్త-వైద్యం** పేద ప్రజలను ఆర్థికంగా అభివృద్ధిలోకి తీసుకురావడమే టీడీపీ లక్ష్యమని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌అజీజ్ అన్నాడు. మంగళవారం నగరంలోని 51వ డివిజనులోని అరవవీధిలో బాబుష్యూరిటీ-భవిష్యత్తుగ్యారెంటీ కార్యక్రమంలో అబ్దుల్‌అజీజ్ ఇంటింటికి తిరుగుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ నగర అభ్యర్థి అయిన పొంగూరు నారాయణని తిరుగులేని మెజార్టీతో గెలిపించాలని కోరాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం చిత్తశుద్ధితో పనిచేసే ఏకైకపార్టీ టీడీపీయేనన్నాడు. వైసీపీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి అన్నివర్గాల వారి పరిస్థితి అతి దయనీయంగా తయారైందన్నాడు. కుల భాగస్వామ్యం, సామాజిక అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, టీడీపీ అధికారంలోకి వస్తే అన్నివర్గాలవారు లబ్ధిపొందుతారని ఆయన తెలియచేశాడు. వైసీపీ అధికారంలోకి వస్తే భవిష్యత్తు తరాలు అంధకారంలోకి వెళ్ళిపోతాయన్నాడు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి ప్రజా ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయాలని కోరాడు. ఈ కార్యక్రమంలో మీదూరి ప్రశాంత్‌కుమార్, కమతం ప్రశాంత్‌కుమార్, అరవ రాజేష్, జీనత్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీమంత్రులు, ఎమ్మెల్యేని కలిసిన కాకర్ల



**నెల్లూరు మార్చి 5, ప్రభాతవార్త-వైద్యం** ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ జనసేన కూటమిల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాకర్ల సురేష్, మంగళవారం నగరంలోని సంతపేటలో ఉన్న వెంకటగిరి ఎమ్మెల్యే, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డిని, అల్లీపురంలో గ్రామంలో మాజీమంత్రి సోమిరెడ్డి నివాసంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని, నగరంలోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలని మర్యాదపూర్వకంగా కలిసి వారికి శాలువాలు కప్పి, పూలబొక్కేలను అందచేసి సత్కరించాడు. ఈ సందర్భంగా కాకర్ల సురేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, జిల్లా నాయకుల సహాయ సహకారాలతో ఉదయగిరి నియోజకవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించినందుకు నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిచేస్తున్నానన్నాడు. రానున్న ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గంలో భారీ మెజార్టీతో చంద్రబాబుకి బహుమతిగా అందిస్తానని సురేష్ అన్నాడు.

## సి-విజిల్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలి



**కోవూరు, మార్చి 5 ప్రభాతవార్త :** రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎఫ్ఎస్ బృందం సభ్యులు సి-విజిల్ యాప్‌పై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందని కోవూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. శ్రీనివాసులు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కోవూరు నియోజకవరగ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన ఎఫ్ఎస్ బృందం సభ్యులకు సి-విజిల్ యాప్‌పై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఈ సి-విజిల్ యాప్‌లో నమోదు చేసుకుని ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్ బృందం సభ్యులు వారి వారి సెల్‌ఫోన్‌లో ఈ సి-విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఏ విధంగా పరిష్కరిస్తారో ఉదాహరణ పూర్వకంగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయశ్రీ, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్లు మధుసూదన్ రావు, రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, తదితరులు ఉన్నారు.

## వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు తప్పక పాటించాలి



కోవూరు, మార్చి 5 ప్రభాతవార్త : వ్యవసాయం సాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు తప్పక పాటించాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ జి. శివన్నారాయణ అన్నారు. కోవూరు మండలం పాటూరు గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో మంగళవారం శాస్త్రవేత్తలు వరి పొలాలను నిశితంగా పరిశీలించి వివిధ సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగుడు ఉన్న పొలాల్లో పోషకాలు అందుబాటులో లేక వేర్లు కుళ్లిపోయి వాసన రావడమే కాకుండా నల్లగా మారిపోయి దుబ్బులు చనిపోతాయన్నారు. ఇటువంటి పొలాల్లో సల్ఫైడ్ ఉన్న ఎరువులు వాడకూడదని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. సీనియర్ శాస్త్రవేత్త పి. మధుసూదన్‌రావు మాట్లాడుతూ ముఖ్యంగా రైతులు వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు వాడుకోవాలన్నారు. అట్లు కాక విచక్షణా రహితంగా ఎరువులు వాడడం వలన నేలలు చౌడుబారిపోతాయన్నారు. కంకి విడుదలయ్యే సమయంలో ప్రొపికొనజోల్ కానీ, కార్బండిజమ్ కాని పిచికారి చేసుకోవాలన్నారు. ఆత్మ సహాయ వ్యవసాయ సంచాలకులు మారుతీదేవి మాట్లాడుతూ కజపులు నివారణకు నారుమడిలో యూరియా నాటిన ఒక వారంలోపు కార్బోఫిరాన్ గుళికలు ఎకరాకు 10 కిలోలు నీరు తగ్గించి వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ వ్యవసాయాధికారి ఈ. శైలజకుమారి, మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, వ్యవసాయ సహాయకులు మౌనిక, చైతన్య, చాద్విక, రైతులు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, మార్చి 5 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో మాఘ మాస మంగళవారం పర్వదినం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో ప్రాత:కాలమునే అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారికి పల్లకి సేవను కన్నులపండువగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్యస్వామి, నందకుమార్ స్వామి, భక్తులు ఉన్నారు.

## బరితెగిస్తున్న వైసీపీ నేతలు



**నెల్లూరు మార్చి 5, ప్రభాతవార్త- వైద్యం** అధికారంలోచేతిలో ఉంది కదాని, వైసీపీ నేతలు బరితెగించి వ్యవహరిస్తున్నారని తెలుగుదేశం పార్టీ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపాడు. మంగళవా రంనగరంలోని 33వ డివిజను చెందిన కరణం హజరత్‌నాయుడు నివాసానికి అక్కడికి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేరుకున్నాడు. గత ఏడాది కాలంగా తనని టార్గెట్ చేస్తూ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అఫీషియల్ ఫేసు బుక్కులోనే అనేక పోస్టులు వచ్చాయని, అప్పుడు పట్టించుకోని పోలీసులు, తన అనుచరుడైన హజరత్‌నాయుడు పొరపాటున ఏదో ఒకపోస్టును పోస్టుచేస్తే రాత్రికి రాత్రే ఆయన నివాసానికి పోలీసులు వచ్చి పోలీసుస్టేషన్‌కి తీసుకెళ్ళేందుకు ప్రయత్నించడం దారుణమన్నాడు. ఈ ప్రాంతంలో 11గంటల 30నిమిషాల వరకు నా కుటుంబసభ్యుల పర్యటన ఉన్న నేపథ్యంలో 11గంటల 45నిమిషాలకు పోలీసుస్టేషన్‌కి వేళ్ళేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నాడు. ఎన్ని అక్రమకేసులు బనాయిం చినా తాము భయపడేదిలేదన్నాడు. ఇక్కడ అధికార పార్టీ ఒక న్యాయం ప్రతిపక్షానికి ఒక న్యాయామాని శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించాడు. తమపై గత కొన్ని నెలలుగా వస్తున్న అన్ని పోస్టింగులను సాక్ష్యాలతో సహా పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేస్తున్నామని ఆయన తెలిపాడు. పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలనుకుంటే రెండువైపులా న్యాయబద్ధంగా ఉండాలన్నాడు. లేదంటే ప్రతిఒక్కరిని సుప్రీంకోర్టు, హైకోర్టు గతంలో ఇచ్చిన అన్ని తీర్పులు తమ వద్దఉన్నాయని, అక్రమకేసులు బనాయించే వారిని కోర్టుమెట్లు ఎక్కిస్తానన్నాడు హెచ్చరించాడు. ఆయనతోపాటు పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

## కాంగ్రెస్ గూటికి కిరణ్



**మనుబోలు, మార్చి 5, ప్రభాతవార్త** మండలంలోని అక్కంపేట మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్ వైకాపాకు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ గూ టికి చేరుకున్నారు. అధికార పార్టీ నాయకుడు రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు వైకాపా నాయకుడు కిరణ్‌కు మార్‌రెడ్డి అధికార పార్టీని వీడి కాంగ్రెస్‌లోకి వెళ్ళడం ఈ ప్రాంతంలో సంచలనం సృష్టిస్తుంది. మండలంలోని అక్కంపేట గ్రామంలో వైకాపా పార్టీ పెట్టినప్పటి నుంచి అంచలంచలుగా వైకాపాలో కీలకనేతగా ఎదిగాడు. ఆ గ్రామంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అనుచరుడిగా అనేక అబివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు చేసి మంచి పేరు తెచ్చుకున్నాడు. ఫిబ్రవరి 11వ తేదీ అక్కంపేట గ్రామంలో ఎన్ఎస్ఆర్ ఫౌండేషన్ పేరుతో తన తండ్రి స్వర్గీయ నారపరెడ్డి సీతారామిరెడ్డి పేరుతో హైస్కూల్ నిర్మించి మంత్రి కాకాణి చేతుల మీదుగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. అనంతరం చకచక కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ వైపుకు అడుగులు వేయడం గమనార్హం. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలతో కలిసి కాంగ్రెస్ పార్టీకి సేవలు అందిస్తున్నారు. నెల్లూరు టౌన్ లేదా రూరల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు కిరణ్ పావులు కదుపుతున్నారు. సర్వేపల్లి నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేసేందుకు మొన్నటి వరకు తన నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పోటీ చేయడం బాగుండదని, నెల్లూరు టౌన్‌కు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ లో నేరుగా షర్మిలతో కలిసి పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలక పాత్ర పోషించడం కిరణ్ స్పీడు, రాజకీయ దూకుడును రాజకీయ పరిశీలకులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు అక్కంపేటలో వైకాపాకు ముఖ్య అనుచరుడు కాంగ్రెస్ గూట్లోకి వెళ్ళడం ఆ పార్టీకి పెద్ద షాక్ తగిలింది. మండల వ్యాప్తంగా కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్ళిన వార్త ప్రకంపనలు సృష్టిస్తుంది.

## అట్టహాసంగా వవ్వేరు బ్యాంకు చైర్మన్ ప్రమాణస్వీకారం

### ప్రజాభిమానం చొరుగున్న వ్యక్తి మల్లన్న : ఎమ్మెల్యే



**బుచ్చి మార్చి 5 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు కో ఆపరేటివ్ రూరల్ బ్యాంకు చైర్మన్ ప్రమాణ స్వీకారం అట్టహాసంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యవహరించారు. చైర్మన్‌గా టంగుటూరు మల్లికార్జునరెడ్డి, డైరక్టర్లుగా మల్లు జయరామయ్య, అల్లం శ్రీనివాసులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతు టంగుటూరు మల్లికార్జునరెడ్డి తనకు తండ్రితో సమానం అని అన్నారు. ఆయనకు ఎప్పుడో ఈ పదవి రావాల్సి వుందని కొన్ని కారణాల వల్ల రాలేదని అన్నారు. మల్లన్న ప్రజల కష్టాలు తెలిసిన మంచి వ్యక్తి మల్లన అని ఆయన ప్రశంసించారు. ఆయన బుచ్చిరెడ్డిపాళెం సర్పంచ్‌గా గ్రామాన్ని ఆయన ఎంతో అభివృ ద్ధి చేశారని అన్నారు. వవ్వేరు బ్యాంకులో జరిగిన అవకతవకలపై సిబిసిఐడికి లెటర్ పెట్టినట్లు ఆయన తెలిపారు. రానున్న ఎన్నికలకు మల్లన్న ఇప్పటి నుండే కసరత్తు చేస్తున్నారని, నన్ను ఎమ్మెల్యే అభ్యర్థిగా, విజయసాయిరెడ్డిని ఎంపి అభ్యర్థిగా గెలిపించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం వవ్వేరు బ్యాంకు చైర్మన్ టంగుటూరు మల్లికార్జునరెడ్డి మాట్లాడుతు వవ్వేరు బ్యాంకు అభివద్ధికి శక్తి వంచనలేకుండా కృషి చేస్తానని అన్నారు. కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ఆయన ప్రత్యేకంగాధన్యవాదాలు తెలిపారు. అనంతరం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడుతు మంచితనానికి నిర్వచనం టంగుటూరు మల్లికార్జునరెడ్డి అని ఆమె ప్రశంసించారు. ఆయన పదవి కాలంలో వవ్వేరు బ్యాంకు అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఆయన రాజకీయ కురువృద్ధుడని, మంచితనానికి నిర్వహంచనమని చెప్పారు. ఈకార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ యువజనాధ్యక్షులు నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, కోవూరు మార్కెటింగ్ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, కోవూరు నాయకులు మల్లారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, మోర్ల మురళీ, కౌన్సిలర్లు కోటంరెడ్డి లలితారెడ్డి, షేక్ షాహుల్, షేక్.షకిలాబేగం, బెళ్ళం మల్లారెడ్డి, బిట్రగుంట ప్రమీలమ్మ, యానాదిరెడ్డి, మైనార్టీనాయకులు షేక్.అల్లాబక్ష, కౌన్సిలర్ శివకుమార్‌రెడ్డి, రాచూరు సత్యనారాయణ, రహమత్‌భాషా, పఠాన్ మహబూబాషా, కౌన్సిలర్ నస్రీన్, కో ఆప్షన్ మెంబర్ షేక్.ఇర్షాద్. రైబాల నాయకులు మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, నిరంజన్‌రెడ్డి, లఘంతోటి మస్తానయ్య, దయాకర్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, పెనుబల్లి సర్పంచ్ ఓడా పెంచలయ్య, ఆర్‌కె రవి, బ్యాంకు సెక్రటరీ శ్రీనివాసులు, డాక్టర్ అల్లాబక్ష, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటి మెంబర్ బట్టా ప్రవల్లిక, బట్టా విల్సన్, అవినాష్‌రెడ్డి పాల్గొన్నారు. పెద్దఎత్తున కేకును కట్ చేసి అభిమానులు మల్లారెడ్డికి తినిపించారు.

## పోలిరెడ్డిపల్లిలో ఘనంగా సరస్వతీ పూజ



**మర్రిపాడు, మార్చి5, ప్రభాతవార్త :** మర్రిపాడు మండలంలోని పోలిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మంగళవారం సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి చిన్నమాచనూరు సరపంచ్ కటకంనర్సింహారావ్, వైసిపి నాయకులు గుంటుపల్లి రమేష్, ఒంగోలు శ్రీనివాసులురెడ్డి, ఇందేల శ్రీనివాసులురెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సరస్వతి పూజ భారతీయ సంస్కృతిలో లోతుగా పాతుకుపోయిన సంప్రదాయం అని , 10వ తగతి విద్యార్థులు పరిక్షలు వ్రాస్తున్న సందర్భంగా పాఠశాలలో ఉత్సాహంగా , భక్తితోజరుపుకోవడం జ్ఞానం, విజ్ఞానం, కళలకు ప్రతిరూపమైన సరస్వతీదేవికి నివాళులర్పిస్తుందన్నారు. నేటి విద్యారంగంలో జ్ఞానాన్ని వెతకడం, జ్ఞానాన్ని స్వీకరించడం , సంప్రదాయం, ఆధునికత సామరస్య సమ్మేళనాన్ని పెంపొందించడం వాటి ప్రాముఖ్యతనుగుర్తు చేస్తుందని పాఠశాలలను సున్నితమైన పూలతో అలంకరించి సదర్భానికి తగినట్లుగా ప్రశాంతమైన , పవిత్రమైన వాతావరణాన్ని సృష్టంచారని కొనియాడారు. తెలివితేటలు, విద్య, సృజనాత్మకత యొక్క దైవిక స్వరూపిణి అయిన సరస్వతి దేవి ఆశీర్వాదం కోరడం వలన విద్యాలయంలో కళాత్మక ప్రయత్నాల్లో శ్రేయస్సు, విజయం లభిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఒత్తిడి లేకుండా పరిక్షలు వ్రాయాలని, మంచి మార్కులతో విజయాలు అందుకోవాలన్నారు. మన పంచాయతీకిమంచి పేరు తీసుకు రావాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ఎగ్జామ్ పాడ్స్, పెన్నులు అందజేసి , 200మందికి భోజనం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేదలకు అభివృద్ధి,సంక్షేమమే లక్ష్యంగా సియం జగన్ పాలన



రాపూరు, మార్చి5ప్రభాతవార్త రాష్టంలోని అన్ని వర్గాల ప్రజలకు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నట్లు తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకునేందుకుప్రతి ఒక్కరు కృషి చేయాలని తిరుపతి జిల్లా వైసిపి ఆధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త, రాష్ట కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి కోరారు. మండల కేంద్రమైన రాపూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండవ రోజైన మంగళవారం నిర్వహించారు. ఇందులోబాగంగా రాపూరులోని శివాలయం వీధి, మొగల్ వీధి, వాడకట్ట, పీర్ల చావిడి వీధి, కడియాల పాలెం, తూర్పు ఆగర్తకట్ట పడమర ఆగర్తకట్ట, తదితర ప్రాంతాలలో ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వారి కుటుంబానికి వివిద పథకాల ద్వారా అందిన లబ్దీని వివరించారు. అలగే వారికి వున్నటువంటిసమస్యలను అడిగి తెలుసుకోని, వాటి పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలంటూ సంబందింత శాఖాధికారులకుఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా పీర్లఛావిడి వీధిలో పర్యటించే సమయంలో నేదురుమల్లి రాంకుమార్ రెడ్డిని పలువురు తమ సందులలో రోడ్లు, కాలువలు లేక పోవడంతో పాటు, మురుగు కాలువలోనే తాగునీటి పైపులు కూడా వున్నాయంటూ చూపించారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే ఈ సమస్యలను తీర్చడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇటువంటి ముఖ్యమంత్రి మరో మారు ప్రతి ఒక్కరు గెలిపించాలనికోరారు. నేదురుమల్లి వెంటవైసిపి సీనియర్ నాయకులు బత్తిన పట్టాభి రామి రెడ్డి, పాపకన్ను మధుసూధన్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ పాపకన్ను దయాకర్ రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ దందోలు నారాయణ రెడ్డి, సర్పంచ్ భూపతి జయమ్మ, వైస్ యంపీపీ పోలంరెడ్డి పెంచల రెడ్డి, యంపీటీసి ఏటూరు గౌరి, తిరుపతి పార్లమెంట్ మైనారిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఖాధర్ భాషా, పెంచలకోనదేవస్థానం మాజీ ఛైర్మన్ నెల్లూరు రవీంద్రా రెడ్డి, ఏటూరు మురళీమోహన్ రెడ్డి, ఏటూరు విజయశేఖర్ రెడ్డి, సచివాలయం కన్వీనర్‌లు మాదమాల పిచ్చి రెడ్డి, డమ్మాయి రమణయ్య, గుండు రాఘవయ్య, గౌస్ ఫీర్, అల్తాఫ్ బేగ్, అబ్దుల్ ఘని, భూపతి జయరామయ్య, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, వైసిపి మండల యూత్ నాయకుడు గుండు బాస్కర్, బొమ్మిరెడ్డి రమణా రెడ్డి, యంపీడీఓ గంగయ్య, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసులు, గ్రామ సచివాలయం సిబ్బంది, మండలంలోని వివిధ శాఖల అధికారులు, గ్రామ వాలంటీర్లు తదితరులున్నారు.

## వవ్వేరు బ్యాంకు చైర్మన్ మల్లారెడ్డికి ఘన సన్మానం



**బుచ్చి మార్చి 5 ప్రభాతవార్త** వవ్వేరు బ్యాంకు చైర్మన్ టంగుటూరు మల్లికార్జునరెడ్డిని కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీ లమ్మ ఆధ్వర్యంలో వాలింటర్లు, పలువురు మహిళలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రమీలమ్మ మాటాడుతు మల్లన్న లాంటి మంచి వ్యక్తికి వవ్వేరు బ్యాంకు చైర్మన్ పదవి రావడం హర్షంచదగ్గ విషయమని అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.